సాక్షి నారాయణపేట

సోమవారం ౹ 8 ౹ సెప్టెంబర్ ౹ 2025



ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నీ

మహబూబ్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ ఆదివారం ముగిసింది.

-8లో ▸



కల్యాణ వైభోగమే..

మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా స్వామివారి కల్యాణం జరిపించారు.

-8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.8 /19.7

వాతావరణం

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మతసామరస్యాన్ని చాటాలి : ఎస్పీ

నారాయణపేట క్రైం: మిలాద్ ఉన్ నబీ పర్వ దినాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలో చేపట్టే ర్యాలీని శాంతియుతంగా నిర్వహించాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిలాద్ ఉన్ నబీ ర్యాలీ సందర్భంగా పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు కులమతాలకు అతీతంగా పండుగలు నిర్వహించుకొని మతసామరస్యాన్ని చాటాల ని కోరారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే, అనుచిత పోస్టులు పెడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

కృష్ణా బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్



కృష్ణా: మండలంలోని కృష్ణా బ్రిడ్జిపై ఆదివారం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. శక్తినగర్, రాయచూర్ పట్టణాల నుంచి గణేశ్ విగ్రహాలను ఒక్కసారిగా కృష్ణా బ్రిడ్జిపైకి అధిక సంఖ్యలో తీసుకురావడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఇటు టైరోడ్డు వరకు, అటు శక్తినగర్ వరకు దాదాపు 5 కి.మీ. మేర ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ క్లియర్ కావడానికి 3గంటల సమయం పట్టింది. గణేశ్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా కర్ణాటక పోలీసులు తగు ఏర్పాట్లు చేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తేవి కావని వాహనదారులు ఆవేదన వ్యక్తంచేశారు.

యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం



మద్దూరు: రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.వెంకట్‌రాంరెడ్డి విమర్శించారు. ఆదివారం మద్దూరులో సీపీఎం ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యయప్రయాసాలకోర్చి సాగుచేసిన వరిపంటకు అవసరమైన యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం మద్దూరు ఏరియా కార్యదర్శిగా గోపాల్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు అశోక్, అంజిలయ్య, అలీ, జోషి, శివకుమార్, హన్మంతు, రామకృష్ణ, లాలప్ప, అరుణ్, వెంకట్ ఉన్నారు.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం సముద్ర మట్టానికి పైన 1,021 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 920 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. సమాంతర కాల్వలో నీటి సరఫరా లేదన్నారు. ఇదిలా ఉండగా జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 875, కుడి, ఎడమ కాల్వలకు 55, ఎత్తిపోతల పథకాలకు 873, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.

కోయిల్‌సాగర్‌లో 32.3 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం ఆదివారం సాయంత్రం వరకు 32.3 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా, మరో 0.3 అడుగుల మేర నీరు చేరితే పూర్తిస్థాయికి చేరుకుంటుంది. వర్షాలు పడకపోవడంతో ప్రాజెక్టు గేట్లను గత వారం నుంచి మూసివేశారు. ప్రాజెక్టు ప్రస్తుతం నిండుకుండలా ఉండడంతో సందర్శకుల సందడి కనిపించింది. జిల్లాకేంద్రం నుంచే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

మిగిలింది ఒక్కరోజే!

చేపపిల్లల సరఫరాకు టెండర్ల దాఖలుపై సందిగ్ధం



- ఆగస్టు 18న నోటిఫికేషన్ జారీ.. ముందుకురాని వ్యాపారులు
- మరోసారి టెండర్లు ఆహ్వానించిన అధికారులు
- నేటి మధ్యాహ్నం 3గంటల వరకు గడువు
- చేపపిల్లల పంపిణీ ఆలస్యంతో మత్స్యకారుల్లో ఆందోళన

నారాయణపేట: మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఉచితంగా చేపపిల్లలు పంపిణీ చేస్తోంది. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఏప్రిల్, మేలో మొదలై.. జూలై నుంచి ఆగస్టు చివరి వరకు జలాశయాలు, చెరువుల్లో నీటినిల్వ సామర్థ్యాన్ని బట్టి చేపపిల్లలు వదిలేవారు. కానీ ఈ ఏడాది చేపపిల్లల పంపిణీ ప్రక్రియ మరింత ఆలస్యమైంది. ఇందుకు గుత్తేదారులు ముందుకు రాకపోవడమే కారణంగా తెలుస్తోంది. జిల్లాలోని జలాశయాల్లో చేపపిల్లల పంపిణీ కోసం ఆగస్టు 18న నోటిఫికేషన్ జారీ చేసి.. 30వ తేదీ వరకు గడువు విధించారు. గుత్తేదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో మరోసారి టెండర్లు ఆహ్వానించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకు టెండర్లు దాఖలుకు గడువు విధించారు.

ముందుకురాని వ్యాపారులు..

చేపపిల్లల సరఫరాకు సంబంధించి వ్యాపారుల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నారు. బిడ్ డాక్యుమెంట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని బిడ్ దాఖలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు వ్యాపారులు ముందుకు వస్తారో లేదో అనే చర్చ కొనసాగుతోంది. గతేడాది చేప పిల్లలను సరఫరా చేసిన వ్యాపారులకు రాష్ట్రవ్యాప్తంగా బిల్లులు చెల్లించాల్సి ఉందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే, స్థానికంగా ఉత్పత్తి చేసిన చేప పిల్లలను మాత్రమే సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో టెండర్ల దాఖలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. గతంలో స్థానికంగా ఉత్పత్తి చేయకుండా.. పొరుగు రాష్ట్రాల నుంచి చేపపిల్లలను దిగుమతి చేసుకోవడంతో ఆశించిన మేర దిగుబడులు రాక మత్స్యకారులకు నష్టం వాటిల్లిందని తెలుస్తోంది. మరోవైపు నిబంధనలకు తిలోదకాలిస్తూ నాణ్యతలేని చేప పిల్లలను పంపిణీ చేస్తూ మమ అనిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో రెండు రిజర్వాయర్లు, 642 చెరువులు, కుంటలు ఉన్నాయి. చెరువుల్లో 35–40 ఎం.ఎం. చేపపిల్లలు 1.02కోట్లు వదిలేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. మరో 82లక్షల 80–100 ఎం.ఎం. చేపపిల్లలు సరఫరా చేయాల్సి ఉంది. ఇందుకు గాను వ్యాపారుల నుంచి టెండర్లు ఆహ్వానించారు. జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువుల్లో చేపపిల్లలను వదలడం వల్ల 147 మత్స్య పారిశ్రామిక సంఘాల్లోని 11,039 సభ్యులకు జీవనోపాధి లభించనుంది. ఇందులో 6 మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా.. 421 మంది సభ్యులు ఉన్నారు.

ఆలస్యమైతే పెరగవు..



చేప పిల్లలను జూలై, ఆగస్టులో పంపిణీ చేస్తే బాగా పెరిగేవి. సెప్టెంబర్, అక్టోబర్‌లో పంపిణీ చేయడం వల్ల ఆశించిన స్థాయిలో పెరగవు. మత్స్యకారులకు నగదు రూపంలో ఇస్తే సకాలంలో చేపపిల్లలను కొనుగోలు చేసి చెరువుల్లో వదులుకునేందుకు అవకాశం ఉంటుంది.

– ఆంజనేయులు, మత్స్య సహకార సంఘం డైరెక్టర్, మాగనూర్

సొంత డబ్బులతో కొనుగోలు..



ప్రభుత్వం గతేడాది కూడా సకాలంలో చేప పిల్లలను సరఫరా చేయలేదు. మత్స్యసహకార సంఘం ఆధ్వర్యంలో సొంత డబ్బులు రూ. 9లక్షలతో 3లక్షల చేప పిల్లలను కొనుగోలు చసి ఊట్కూరు పెద్ద చెరువులో వదిలాం. ఈ ఏడాది చెరువు అలుగు పారి పక్షంరోజులు అవుతుంది. ఇప్పటివరకు ప్రభుత్వం చేప పిల్లలను పంపిణీ చేయలేదు. ఆలస్యంగా వదిలితే ఆశించిన స్థాయిలో చేప పెరగదు.

– ఎం.నరేశ్‌కుమార్, మత్స్య సహకార సంఘం డైరెక్టర్, ఊట్కూర్

టెండర్లు స్వీకరిస్తున్నాం..

ప్రభుత్వ ధరకు చేప పిల్లలను సరఫరా చేసేందుకు గాను రాష్ట్ర మత్స్యశాఖ మరోసారి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేయవచ్చు. ఇదే రోజు 3:30 గంటలకు టెండర్లు ఓపెన్ చేస్తారు.

– రహిమాన్, జిల్లా మత్స్యశాఖ అధికారి

కమిటీ పర్యవేక్షణలో..

కలెక్టర్ సిక్తా పట్నాయక్ దిశానిర్దేశంతో చేపపిల్లల పంపిణీకి సంబంధించిన టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. టెండర్ల కమిటీ చైర్మన్‌గా అడిషనల్ కలెక్టర్, మెంబర్ కం కన్వీనర్‌గా జిల్లా మత్స్యశాఖ అధికారి, సభ్యులుగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, ఈడీఎం, ఇరిగేషన్ ఈఈలు ఉన్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో చేపపిల్లల టెండర్లు, మత్స్యకారులకు పంపిణీ, చెరువుల్లో వదిలేంత వరకు వారి పర్యవేక్షణలో ప్రక్రియ కొనసాగుతుంది.

ఆలయాల మూసివేత



కురుమూర్తి స్వామి ఆలయాన్ని మూసిన సిబ్బంది



మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ద్వార బంధం చేస్తున్న అర్చకులు

చిన్నచింతకుంట/మహబూబ్‌నగర్ రూరల్: చంద్రగ్రహణం సందర్భంగా అమ్మాపూర్ కురుమూర్తిస్వామి, మన్యకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాలను ఆదివారం మూసివేశారు. సంప్రోక్షణం, అభిషేకం, అలంకారం బాలభోగం అనంతరం సోమవారం ఉదయం 9 గంటలకు భక్తులకు మన్యంకొండలో స్వామివారి దర్శనం కల్పించనున్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని ఆలయాల సిబ్బంది కోరారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు వెంకటయ్య, ఆలయ కమిటీ మెంబర్లు భాస్కరాచారి, కమలాకర్, సిబ్బంది శివానందచారితో పాటు పలువురు ఉన్నారు.

యోగా పోటీల్లో 5 పతకాలు



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: నిర్మల్‌లో ఈనెల 5 నుంచి ఆదివారం ముగిసిన రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించినట్లు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.సురేష్, ప్రధాన కార్యదర్శి కె.సాయికుమార్, కోశాధికారి యూ.సురేష్ తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్ క్రీడాకారులు బి.కవిత ఓ బంగారం, కాంస్య పతకాలు, కీర్తనారెడ్డి బంగారు, రజతం, సుప్రజ కాంస్య పతకం సాధించగా కె.సృజన నాలుగో స్థానం నిలిచినట్లు తెలిపారు. వీరికి కోచ్‌గా ఉన్న సాయికుమార్‌ను వారు అభినందించారు.

న్యాయమైన పరిహారం కోసమే ఆందోళన



నారాయణపేట: తాము పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకానికి వ్యతిరేకం కాదని.. భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని మాత్రమే డిమాండ్ చేస్తున్నామని భూ నిర్వాసితుల సంఘం సలహాదారులు బండమీది బలరాం, కృష్ణ మడివాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద భూ నిర్వాసితులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాటికి 55వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వలసలు, కరువుకు నెలవుగా మారిన నారాయణపేట ప్రాంతానికి తప్పనిసరిగా ఈ ప్రాజెక్టు అవసరమన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి భూ నిర్వాసితులు ఎలాంటి అభ్యంతరం చెప్పడం లేదని.. న్యాయమైన పరిహారం కోసమే ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ. 35లక్షలు ఇవ్వాలని కోరారు. రిలే దీక్షలు చేపట్టిన వారిలో అంజప్ప, నర్సింహులు, కాశప్ప, శివ, గోవర్ధన్, సుదర్శన్, భాస్కర్ ఉన్నారు.

జాతీయస్థాయి శిక్షణకు జిల్లా ఉపాధ్యాయుడు



హెచ్‌ఎం నర్సింహ

నారాయణపేట రూరల్: కృష్ణా మండలం కున్సీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న కుందేటి నర్సింహ జాతీయ స్థాయి శిక్షణకు ఎంపిక య్యారు. సీసీఆర్టీ ఆధ్వర్యంలో ఈ నెల 10నుంచి 24వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించే శిక్షణకు ఆయన హాజరు కానున్నారు. జూన్‌లో రాష్ట్రస్థాయిలో జరిగిన శిక్షణ శిబిరానికి ఆయన హాజరై ప్రతిభ చాటడంతో జాతీయస్థాయికి ఎంపికయ్యారు. జాతీయ విద్యా విధానం–2020 అంశంపై 15 రోజుల పాటు శిక్షణ కొనసాగనుంది. కాగా, హెచ్‌ఎం కుందేటి నర్సింహ ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకోవడం విశేషం. ఈ మేరకు నర్సింహను డీఈఓ గోవిందరాజులు, ఎంఈఓ నిజాముద్దీన్ అభినందించారు.

వంద రోజుల్లో 918 టీఎంసీలు

జూరాలకు రికార్డుస్థాయిలో పోటెత్తిన వరద



జూరాలకు భారీ వరద రావడంతో పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

- 675 టీఎంసీలు నదిలోకి..
- ఎత్తిపోతల పథకాల కోసం 17.2 టీఎంసీలు విడుదల
- సెప్టెంబర్ మొదటి వారంలోనే విద్యుదుత్పత్తి లక్ష్యం పూర్తి

గద్వాల: ఎగువ ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఏకధాటిగా భారీ వర్షాలు కురుస్తుండడంతో జూరాలకు భారీగా వరద వచ్చి చేరుతుంది. దీంతో ఉమ్మడి జిల్లాకు పెద్దదిక్కుగా ఉన్న కృష్ణానదిపై నిర్మించిన తొలి ప్రాజెక్టు జూరాలకు జలకళ సంతరించుకుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నీటిని ఎత్తిపోస్తూ దానికిందున్న ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేస్తున్నారు. ఈసారి జూరాలకు ముందస్తుగానే మే నెలలో 29వ తేదీన వరద మొదలవగా సెప్టెంబర్ 6వ తేదీ వరకు 918 టీఎంసీల వరద వచ్చింది.

❐ గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా వానాకాలంలో ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో కృష్ణాబేసిన్‌కు భారీగా వరదనీటితో నిండిపోయింది. కృష్ణాబేసిన్‌లో ఉన్న మహారాష్ట్రలోని ఉజ్జయిని, కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు భారీ వరదనీరు వచ్చి చేరుతుండడంతో నీటిని దిగువనున్న జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు విడుదల చేస్తున్నారు. మన రాష్ట్రంలో కృష్ణాబేసిన్‌లో తొలిప్రాజెక్టు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు మే 29వ తేదీన మొదటిసారిగా వరద మొదలైంది. అప్పటి నుంచి ఈ నెల 6వ తేదీ వరకు ప్రాజెక్టుకు గరిష్ఠంగా 4.18 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరగా, ప్రాజెక్టులోని 44 గేట్లు ఎత్తి దిగువనున్న శ్రీశైలానికి నీటిని విడుదల చేశారు. జూరాలకు వరద మొదలైనప్పటి నుంచి ప్రాజెక్టుకు మొత్తం 918 టీఎంసీల నీరు వచ్చింది. జూన్, జూలైలో మాసాల్లో వర్షాలు లేకపోవడంతో చాలా రోజులు జూరాలకు వరద పూర్తిగా తగ్గిపోయింది. తిరిగి జూలై చివరి వారంలో వరద ప్రారంభం కావడంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి, నీటిని విడుదల చేశారు.

జూరాలకు వచ్చిన వరద వినియోగం ఇలా.. (టీఎంసీల్లో)

వచ్చిన వరద	918
దిగువకు విడుదల చేసింది	675
నెట్టెంపాడుకు	4.3
భీమా లిఫ్ట్- 1	2.6
భీమా లిఫ్ట్ - 2	2.9
కోయిల్‌సాగర్	1.9
ఎంజీకేఎల్ఐ	4
విద్యుదుత్పత్తి	224

సాగునీటి పథకాలకు 17.2 టీఎంసీలు

వానాకాలంలో జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చిచేరుతుండడంతో ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు జలకళ సంతరించుకుంది. జూరాల నుంచి 17.2 టీఎంసీలు సాగునీటి ప్రాజెక్టులకు వినియోగించుకుని మిగతా 675 టీఎంసీల నీటిని నదిలోకి వదిలేశారు. ఇందులో నెట్టెంపాడు ప్రాజెక్టుకు (4.3 టీఎంసీలు), భీమా–1 (2.6 టీఎంసీలు), భీమా–2, (2.9 టీఎంసీలు) కోయిల్‌సాగర్‌కు (1.9 టీఎంసీలు), కల్వకుర్తి ఎత్తిపోతలకు (4 టీఎంసీలు), జూరాల కుడి, ఎడమ, సమాంతర కాల్వలకు (1.50 టీఎంసీలు) ఎత్తిపోయగా.. మిగిలిన 659టీఎంసీలను నదిలోకి వదిలేశారు.

లక్ష్యానికి చేరిన విద్యుదుత్పత్తి



ఎగువ జూరాల పవర్ హౌజ్ కేంద్రం

ఆత్మకూర్: జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో ఈ ఏడాది ఉత్పత్తి లక్ష్యాన్ని అధికారులు చేరుకున్నారు. ప్రాజెక్టు చరిత్రలో మొదటిసారి సెప్టెంబర్ మొదటి వారంలోనే లక్ష్యానికి చేరుకొని రికార్డు సృష్టించారు. ఈ ఏడాది మే నెలలో కురిసిన ముందస్తు వర్షాలకు విద్యుదుత్పత్తి ప్రారంభించగా.. ఆదివారం 613 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించారు. కాగా ఈ ఏడాది విద్యుదుత్పత్తి లక్ష్యం 610 మిలియన్ యూనిట్లుగా ఉంది. ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలతో వరద జలాశయానికి చేరడంతో ముందస్తు విద్యుదుత్పత్తి సాధ్యమైందని అధికారులు చెబుతున్నారు.

➪ జూరాల ఎగువ జల విద్యుత్ కేంద్రంలోని మూడో యూనిట్‌లో సాంకేతిక సమస్య తలెత్తగా రెండేళ్లుగా చైనా నుంచి వచ్చిన సాంకేతిక నిపుణులు మరమ్మతు చేపట్టారు. ఈ ఏడాది ఆగస్టు మూడో వారంలో సమస్య పరిష్కారమై వినియోగంలోకి రావడంతో విద్యుదుత్పత్తి మరింత పెరిగింది. ఈ యూనిట్ ముందు నుంచి వినియోగంలో ఉంటే ఆగస్టులోనే లక్ష్యాన్ని చేరుకునే వారమని అధికారులు చెబుతున్నారు.

ఏడాది వారీగా విద్యుదుత్పత్తి ఇలా (మి.యూ.లలో..)

సంవత్సరం	లక్ష్యం	సాధించిన ఉత్పత్తి
2020-21	648	775
2021-22	724	704
2022-23	640	876
2023-24	600	212
2024-25	600	678
2025-26	610	613

➪ దిగువ జూరాలలో ఆరు యూనిట్లు ఉండగా ఒక్కొక్క యూనిట్‌లో 40 మెగావాట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపడుతున్నారు. 24 గంటల పాటు 40 మెగావాట్ల ఉత్పత్తి చేపడితే 9,600 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. 100 ఓల్టేజీ గల పది బల్బులు ఒక గంటసేపు వాడితే ఒక్క యూనిట్ కరెంట్ ఖర్చు అవుతుంది. 10 లక్షల యూనిట్లకు ఒక మిలియన్ యూనిట్ అవుతుంది. ఒక మిలియన్ యూనిట్ విద్యుదుత్పత్తికి 0.78 టీఎంసీల నీటిని వినియోగిస్తారు.

ప్రాజెక్టు చరిత్రలో మొదటిసారి..



జూరాల ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో మే 30న ఉత్పత్తి ప్రారంభించి సెప్టెంబర్ 7వ నాటికే 613 మి.యూ. ఉత్పత్తి సాధించి ప్రాజెక్టు చరిత్రలోనే మొదటిసారి అతి త్వరగా లక్ష్యాన్ని చేరుకున్నాం. ముందస్తు వరదలు, సిబ్బంది సహకారంతోనే ఇది సాధ్యమైంది. ఈ ఏడాది రికార్డుస్థాయిలో విద్యుదుత్పత్తి చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

– శ్రీధర్, ఎస్ఈ, జెన్‌కో, జూరాల

వినాయకా.. వీడ్కోలిక

- జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనోత్సవం
- మక్తల్‌లో ఆకట్టుకున్న శోభాయాత్ర
- నృత్యాలతో హోరెత్తించిన యువత, చిన్నారులు
- పోలీసుల పటిష్ట బందోబస్తు

- వివరాలు 9లో..



క్లుప్తంగా

వివాహిత అనుమానాస్పద మృతి


రేణుక (ఫైల్)

భూత్పూర్: మండలంలోని కప్పెటకు చెందిన రేణుక ఆదివారం అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. కప్పెటకు చెందిన రేణుక తన భర్త వెంకటస్వామి ప్రతినిత్యం మద్యం సేవించి సంసార విషయంలో గొడవ పడుతుండేవారు. శనివారం రాత్రి భార్యభర్తలు గొడవపడ్డారు. ఆదివారం ఉదయం రేణుక అనుమానాస్పదంగా మృతిచెందింది. కూతురు శ్రావణికి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి వ్యక్తి మృతి


జోగు బాలయ్య (ఫైల్)

మరికల్: ట్రాక్టర్ కిందపడి జీపు డ్రైవర్ మృతిచెందిన ఘటన ఆదివారం రైల్వే వంతెనపై చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. మరికల్‌కు చెందిన జోగు బాలయ్య(49) కన్మనూర్ క్రాస్‌రోడ్డు నుంచి జీపులో మధ్యసీటులో కూర్చున్నాడు. మరో డ్రైవర్ జీపును నడిపిస్తూ మరికల్‌కు వస్తుండగా.. రైల్వేబిడ్జిపైకి రాగానే ఎదురుగా ట్రాక్టర్ వచ్చింది. ఈ క్రమంలో మధ్య సీటులో కూర్చున్న బాలయ్య ఆకస్మాత్తుగా ట్రాక్టర్ ఇంజన్ టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడితోపాటు మరో ముగ్గురు డ్రైవర్లు కూడా జీపుల్లో ఉన్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు. మృతాదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు.

వాహనం బోల్తాపడి డ్రైవర్ దుర్మరణం

మరికల్: మిరపకాయల లోడుతో వెళ్తున్న బొలేరో టైర్ ఊడిపడి బోల్తా పడగా.. డ్రైవర్ మృతిచెందిన ఘటన శనివారం అర్ధరాత్రి ఎలిగండ్ల స్టేజీ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటకలోని బళ్లారి జిల్లా కురుహోడ తాలూకా సిందిగేరి గ్రామానికి చెందిన మహేశ్(21) బొలేరోలో మిరపకాయల లోడుతో సిందిగేరి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. మరికల్ మండలం ఎలిగండ్ల స్టేజీ సమీపంలోకి రాగానే బొలేరో వెనుక టైర్ ఊడిపోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. అందుల్లో మహేశ్ కిందపడగా ఆయన మీద మిరపకాయ బస్తాలు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అడ్డాకుల: జాతీయ రహదారిపై మండలంలోని కాటవరం స్టేజీ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్‌తోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్‌కు చెందిన ఆరుగురు బొలేరోలో వినాయక నిమజ్జనం కోసం కొత్తకోట వైపు వెళ్తుండగా.. కాటవరం స్టేజీ సమీసంలో స్పిన్నింగ్ మిల్లు వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో బొలేరో డీవైడర్ మీదకు దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో బొలేరోలో ఉన్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రొడ్డ లింగం, మరో ఇద్దరు కిరణ్ కుమార్, రాధేశ్యామ్‌కు గాయాలయ్యాయి. మిగిలిన ముగ్గురు ఎలాంటి గాయాలు కాకుండా ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు జిల్లా కేంద్రానికి తరలించారు. బొలేరో డ్రైవర్ చెన్నంగిరి రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కొత్తకోట రూరల్: మండలంలోని రామనంతాపురం గ్రామానికి చెందిన వడ్డె కుర్మయ్య(55) కొన్నేళ్లుగా పట్టణంలోని 7వ వార్డులో నివాసం ఉంటున్నాడు. ప్రతి రోజూ రాళ్లు కొట్టేందుకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. రోజువారీ పనిలో భాగంగా ఉదయం అడ్డాకుల సమీపంలో గుట్టపై రాళ్లు కొట్టేందుకు తన బైక్‌పై వెళ్లాడు. పనిముగించుకుని సాయంత్రం కొత్తకోటలోని ఇంటికి బయలు దేరాడు. పాలెం సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో కాళ్లు, చేతులు విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే 108లో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు వల్లపు శేషుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి

ఇద్దరు మృతి, విద్యార్థి గల్లంతు

వేర్వేరు ప్రాంతాల్లో చేపల వేటకు వెళ్ల ఇద్దరు మృతిచెందగా.. ఒక విద్యార్థి గల్లంతైన ఘటన ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఆదివారం చోటుచేసుకున్నది. చేపల కోసం విసిరే వల చుట్టుకొని ఇద్దరు మృతిచెందగా.. పుట్టి జూరాల వరద ప్రవాహంలో కొట్టుకుపోయి లోయర్ జెన్‌కో ప్రాంతంలో గల్లంతైన బాలుడి కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపట్టగా.. ఫలితం లేకపోయింది.

- గద్వాల క్రైం/గండేడ్/నాగర్‌కర్నూల్ క్రైం


విద్యార్థి గల్లంతైన లోయర్ జూరాల

- వలలు చుట్టుకొని మృతిచెందిన వైనం
- ఎన్డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు
- వరద తగ్గితే ఆచూకీ లభించే అవకాశం


గల్లంతైన విద్యార్థి చంద్రశేఖర్

ఇద్దరు మైనర్లు శనివారం రాత్రి చేపల వేటకు పుట్టి సహాయంతో నదిలోకి వెళ్లి వలవేసి ఒడ్డుకు చేరుకున్నారు. రాత్రి కావడంతో ఇద్దరు ఒడ్డుకు చేర్చుకున్న పుట్టిలోనే నిద్రకు ఉపక్రమించారు. నదీ ప్రవాహం క్రమేపీ పెరగడంతో నీటి ప్రవాహంలో పుట్టి కొట్టుకుపోతన్నట్లు గుర్తించిన ఓ బాలుడు తేరుకుని బయటపడ్డాడు. మరో బాలుడు పుట్టితో సహా గల్లంతైన ఘటన గద్వాల మండలం రేకులపల్లిలో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసుల కథనం మేరకు.. తెలుగు రాజేశ్, తెలుగు చంద్రశేఖర్(13) తొమ్మిదో తరగతి. గ్రామంలోని కృష్ణానది (లోయర్ జెన్‌కో) ప్రాంతంలో శనివారం రాత్రి చేపల వల వేసేందుకు వెళ్లారు. పుట్టిలో వెళ్లిన ఇద్దరు వలలు వేసిన తర్వాత నదీ ఒడ్డుకు వచ్చి అదే పుట్టిలో నిద్రపోయారు. ఒడ్డుకు చేరుకున్న క్రమంలో పుట్టిని తాడుతో కట్టివేయడం మరచిపోయారు. రాత్రి 10గంటల సమయంలో జూరాలకు కొంత మేర ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు 8 నుంచి 11గేట్లు తెరిచ్చారు. వరద ప్రవాహం పెరగడంతో అలల తాకిడికి పుట్టి ముందుకు సాగుతూ లోయర్ జెన్‌కో స్పిల్‌వే నుంచి జారి పడింది. నిద్రలోంచి తెరుకున్న రాజేశ్ ఈత రావడంతో బయటపడ్డాడు. అయితే చంద్రశేఖర్ ప్రమాదవశాత్తు వరద ప్రవాహానికి కొట్టుకుపోయాడు. గల్లంతైన బాలుడుకి ఈత రాదనే విషయం తెలుసుకున్న వెంటనే బంధువులు, గ్రామస్తులు నదీ వద్దకు చేరుకున్నా ఫలితం లేకపోయింది. రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ ఎన్డీఆర్ఎఫ్ బృందంతో అక్కడికి చేరుకున్నారు. 1.20లక్షల క్యూసెకుల వరద ఉండడంతో వెలుపలికి వెళ్లినప్పటికీ సాధ్యం కాలేదు. గల్లంతైన విద్యార్థి కోసం అధికారులు శ్రమిస్తున్నారు. గల్లంతైన విద్యార్థి ఎప్పుడూ చేపల వేటకు వెళ్లలేదని ప్రస్తుతం ఎందుకు వెళ్లాడో తెలియదని బంధువులు చెబుతున్నారు. విద్యార్థి తండ్రి ఎనిమిదేళ్ల క్రితమే విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందడంతో తల్లి పద్మ తన ముగ్గురు పిల్లలతో కలసి జీవిస్తున్నది. గల్లంతైన చిన్న కుమారుడు గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. సెలవులు ఉండడంతో ఇంటికి వచ్చి వరద ప్రవాహంలో కొట్టుకుపోయాడని తల్లి కంటతడి పెట్టింది. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. వరద ప్రవాహం తగ్గుముఖం పడితే ఆచూకీ లభించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఆశిరెడ్డిపల్లిలో..

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఆశిరెడ్డిపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గత్ప లక్ష్మయ్య (40) రెడ్డిపిల్లి రెడ్డిచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఉదయం 11గంటల ప్రాంతలో తన అన్న కృష్ణయ్యకు చెప్పి వల తీసుకొని చేపల వేటకు వెళ్లాడు. మధ్యాహ్న ఒంటి గంట అయినా.. తిరిగి రాకపోవడంతో కృష్ణయ్య చెరువు దగ్గరకు వెళ్లి చూడగా లక్ష్మయ్య వల చుట్టుకొని మృతిచెంది నీటిపై తెలియాడుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందిచాడు. మృతుడికి భార్య, కూతురు, కూమారుడు ఉన్నారు.


లక్ష్మయ్య(ఫైల్)

వల కాలుకు చుట్టుకొని వృద్ధుడు..

చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన వృద్ధుడు ప్రమాదవశాత్తు కిందపడడంతో మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం చెరువు అలుగులో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ కథనం ప్రకారం.. మండలంలోని ఔరాసిపల్లికి చెందిన పెబ్బేటి సత్యం (62) కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. ఇతడు ఆదివారం కేసరి సముద్రం చెరువు అలుగులో చేపలు పట్టేందుకు వల విసరగా.. ప్రమాదవశాత్తు వల కాలుకు చుట్టుకొని కిందపడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమత్తం జనరల్ ఆస్పత్రి మార్చురికి తరలించారు. ఘటకు సంబంధించి మృతుడి కుమారుడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చాంపియన్లుగా శివాంశ్, శాన్వి



పతకాలు సాధించిన విద్యార్థులతో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్

- ముగిసిన రాష్ట్రస్థాయి అండర్–13 బ్యాడ్మింటన్ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 11వ రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్–13) బాల, బాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఉత్సాహంగా ముగిసింది. చివరి రోజు ఆదివారం బాల, బాలికల సింగిల్స్, డబుల్స్ విభాగాల ఫైనల్స్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి.

➡ సింగిల్స్ చాంపియన్లు శివాంశ్, నిమ్మశాన్వి బ్యాడ్మింటన్ టోర్నీ సింగిల్స్ విభాగంలో చాంపియన్లుగా పబ్బు శివాంశ్ (మేడ్చల్ మల్కాజ్‌గిరి), కంజుల జస్ప్రీత్ (వరంగల్) నిలిచారు. ఫైనల్ మ్యాచ్‌లో శివాంశ్ పబ్బు 15–8, 15–4 సెట్ల తేడాతో కంజుల జస్ప్రీత్‌పై విజయం సాధించాడు. అదేవిధంగా బాలికల ఫైనల్ నిమ్మశాన్వి (సంగారెడ్డి) 15–8, 15–7 సెట్ల తేడాతో అనుముల శ్రీవైభవి (నిజామాబాద్)పై గెలుపొందింది. సింగిల్స్ బాలుర మూడో స్థానంలో అద్వైత్ సత్తు (వికారాబాద్), నాలుగో స్థానంలో రాంచరణ్ తేజ ఆకుల (మేడ్చల్ మల్కాజ్‌గిరి), బాలికల విభాగంలో మూడో స్థానంలో దియా ఆనంద్ (వికారాబాద్), నాలుగో స్థానంలో మనస్విని భూక్య (వరంగల్) నిలిచారు.

హోరాహోరీగా డబుల్స్ మ్యాచ్‌లు

డబుల్స్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. బాలుర మ్యాచ్‌లో కార్తీకేయ మహర్షి (రంగారెడ్డి)– శివాంశ్ పబ్బు (మేడ్చల్ మల్కాజ్‌గిరి) 15–11, 15–9 తేడాతో రాంచరణ్‌తేజ ఆకుల–శౌర్య ప్రతాప్‌సింగ్ (మేడ్చల్ మల్కాజ్‌గిరి)పై విజయం సాధించారు. మూడో స్థానంలో అద్వైత్ సత్తు (వికారాబాద్)–సుహిత్ యాదవ్ (రంగారెడ్డి), నాలుగో స్థానంలో అభిషిక్త్ (కరీంనగర్)–కంజుల జస్ప్రీత్ (వరంగల్) నిలిచారు. బాలికల డబుల్స్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లో ఆభాజాదవ్ (రంగారెడ్డి)–దియా ఆనంద్ (వికారాబాద్) 15–4, 15–8 సెట్ల తేడాతో దీక్ష సహస్ర బండ (వికారాబాద్)–నిమ్మశాన్వి (సంగారెడ్డి)పై గెలుపొందారు. మూడో స్థానంలో తిరిణిచిత భూషణ్ (వికారాబాద్)– అన్విరెడ్డి (సంగారెడ్డి) నిలిచారు.

జాతీయస్థాయిలో ప్రతిభచాటాలి

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచినవారు రానున్న జాతీయ స్థాయి టోర్నీలో ప్రతిభచాటాలని ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ అన్నారు. ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విన్నర్, రన్నరప్, మూడో స్థానం వారికి ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఇదేస్ఫూర్తితో బ్యాడ్మింటన్‌లో పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అమరేందర్‌రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సురేందర్‌రెడ్డి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సంయుక్త కార్యదర్శి యూవీఎన్ బాబు, మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌గౌడ్, రవికుమార్, నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు విక్రం ఆదిత్యరెడ్డి, డాక్టర్ దీపక్, ప్రవీణ్‌కుమార్, నాగరాజుగౌడ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలే హత్యకు ప్రేరణ


హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న కల్వకుర్తి డీఎస్పీ వెంకట్‌రెడ్డి

- కన్నతండ్రి బాలయ్యను హత్య చేసిన కుమారుడు బీరయ్య
- మొండెం, తల వేరు చేసి.. డిండిచింతపల్లి, డీఎల్ఐ కాల్వల్లో పారవేత
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకట్‌రెడ్డి

కల్వకుర్తి టౌన్: మూఢనమ్మకాల అనుమానంతోనే కన్నతండ్రిని హత్య చేయాలని కుమారుడు పథకం రచించాడని.. ఈ ప్రణాళికలో భాగంగానే పొలం వద్ద పంచాయితీ పెట్టుకొని హత్య చేశాడని.. అనంతరం తల, మొండెంను వేరుచేసి డిండిచింతపల్లి, డీఎల్ఐ కాల్వలో పారవేశారని కల్వకుర్తి డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. సంచలనం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను ఆయన ఆదివారం కల్వకుర్తిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. కల్వకుర్తి పట్టణంలోని వాసవినగర్ కాలనీలో నివాసం ఉండే బాలయ్య (70)కు ముగ్గురు కుమారులు ఉండగా.. ఇందులో ఒకరు గతంలో చనిపోయారు. మిగిలిన ఇద్దరిలో చిన్న కుమారుడు బీరయ్య. అయితే, బీరయ్యకు ఒక కుమార్తె ఉండగా.. మూడు నెలల క్రితం బాలిక ఆత్మహత్య చేసుకుంది. నాటి నుంచి బాలిక తండ్రి బీరయ్య నిత్యం ఆలోచనలో ఉంటూ.. కూతురి మృతికి గల కారణాలను అన్వేషిస్తూ ఉన్నాడు. ఈక్రమంలో ఓ మాంత్రికుడి వద్దకు వెళ్లిన బీరయ్యకు నీ కూతురి మృతికి నీ తండ్రి బాలయ్యనే కారణమని చెప్పాడు. దీంతో నాటి నుంచి తండ్రిపై పగ పెంచుకున్నాడు బీరయ్య ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలో ఈ నెల 3వ తేదీన పొలం వద్ద పశువులను మేపుకుంటూ ఉన్న తండ్రి బాలయ్య గొడవకు దిగాడు. పంచాయితీ కాస్త పెద్దగా కావడంతో అక్కడే ఉన్న కర్రతో తండ్రి బాలయ్య తలపై కుమారుడు బీరయ్య విచక్షణా రహితంగా దాడి చేశాడు. రక్తపు మడుగులో ఉన్న బాలయ్య స్పృహతప్పి పడిపోయాడు. ఇదే అదునుగా అతన్ని చనిపోయే వరకు దాడిచేశాడు. ఈ దాడిని బాలయ్య వద్ద పనిచేసే రామచంద్రి చూడగా, అతని వద్దకు వెళ్లి ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే నిన్ను కూడా చంపేస్తా అనడంతో అతడు అక్కడి నుంచి భయపడి పారిపోయాడు.

హత్యకు ముందు నుంచే ప్రణాళిక..

ఇదిలాఉండగా, తండ్రి బాలయ్యని ఎలాగైనా చంపాలని బీరయ్య ముందే పక్కా ప్రణాళిక వేశాడు. గొడవ చోటుచేసుకోవడంతో ఇదే అదునుగా హత్య చేశాడు. అయితే, వరుసకు మేనల్లుడు అయిన వంగూర్ మండలం రంగాపూర్‌కు చెందిన అంజికి బీరయ్య విషయాన్ని అంతా ఫోన్ ద్వారా వివరించాడు. తండ్రిని హత్య చేసిన తర్వాత అంజి అప్పటికే సిద్ధంగా ఉండటంతో అతని కారు డిక్కీలో బాలయ్య మృతదేహాన్ని వేసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇదిలాఉండగా, పొలం వద్దకు వెళ్లిన తండ్రి బాలయ్య రాత్రి అయినా ఇంటికి రాకపోవటంతో మరో కుమారుడు మల్లయ్య పొలం వద్దకు వెళ్లి వెతికాడు. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అక్కడ ఉన్న రక్తపు మరకలు, రామచంద్రి తెలిపిన వివరాలతో విచారణ చేపట్టారు. నిందితులు బీరయ్య, అంజి ఫోన్ లొకేషన్ ద్వారా వారు పట్టణంలోని జేపీనగర్ నుంచి కొట్రకు వెళ్లే దారిలో అనుమానంతో సంచరిస్తుండగా వారిని పట్టుకొని విచారించగా తండ్రిని హత్య చేశానని ఒప్పుకున్నాడు.

విచారణలో విస్తుపోయే విషయాలు

పోలీసుల విచారణలో తండ్రి బాలయ్యపై దాడి చేసి తానే హత్య చేశానని, మృతిచెందాడని నిర్ధారించుకున్న తర్వాత మృతదేహాన్ని కారు డిక్కీలో తీసుకెళ్లామని బీరయ్య ఒప్పుకున్నాడు. అనంతరం శరీరం నుంచి తలను చిన్న రంపంతో వేరుచేసి, మొండెంను వంగూర్ మండలం డిండిచింతపల్లి కాల్వలో, తలను డీఎల్ఐ కెనాల్‌లో పడేశానని తెలిపాడన్నారు. తలను వేరు చేసే సమయంలో బాలయ్య చెవికి ఉన్న బంగారు రింగులను రంపంతోనే కట్‌చేసి వారితో పాటుగా తీసుకెళ్లారు. ఈ వివరాలతో రెండు కాల్వల్లో గాలింపు చర్యలు చేపట్టి మొండెం, తలను స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబసభ్యులకు అందజేశామన్నారు. నిందితులు ఇద్దరిని కల్వకుర్తి జడ్జి ఎదుట హాజరుపర్చగా వారి ఆదేశానుసారంగా రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. హత్యకు ఉపయోగించిన కర్రతో పాటుగా, రంపం, కారు, బైక్, బంగారు చెవిపోగులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. హత్య కేసును చేదించిన కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్‌ఐలు మాధవరెడ్డి, మహేష్, వెంకట్‌రెడ్డి, సిబ్బంది, గ్రామస్తులకు నగదు రివార్డులను అందజేశారు.

మృతదేహంతో బైఠాయింపు


నిందితుడి ఇంటి ముందు శవంతో నిరసన తెలుపుతున్న భర్త, పిల్లలు

బల్మూర్: మండలంలోని బాణాలలో ఈనెల 4న ఆత్మహత్యకు పాల్పడిన సంపంగి పార్వతమ్మ మృతి ఘటనకు కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మృతురాలి కుటుంబ సభ్యులు గ్రామంలో ఆందోళన చేపట్టారు. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బాణాలకు చెందిన పార్వతమ్మకు మూడేళ్ల నుంచి అదే గ్రామానికి చెందిన శరత్‌తో వివాహేతర సంబంధం కొనసాగుతుండగా.. గురువారం భర్త నరేశ్ ఇద్దరు కలిసి ఉండటాన్ని గమనించి నిలదీయగా.. శరత్ పారిపోవడంతో పార్వతమ్మ పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఈనెల 5న మృతి చెందింది. పార్వతమ్మ మృతికి కారణమైన శరత్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బాణాలలో మృతదేహంతో శరత్ ఇంటి ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో అచ్చంపేట సీఐ నాగరాజ్, బల్మూర్ ఎస్‌ఐ రాజేందర్, లింగాల ఎస్‌ఐ వెంకటేష్‌గౌడ్‌లు బాణాల గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి ఆవాంఛనియ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబసభ్యులకు హామీ ఇవ్వడంతోవారు శాంతించారు.

మన్యంకొండవాసుడి కల్యాణ వైభోగమే..


అలంకరణలో స్వామివారు

మహబూబ్‌నగర్ రూరల్ : మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి రోజు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన శేష వాహనంలో స్వామి దంపతులను గర్భగుడి నుంచి దేవస్థానం సమీపంలోని మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాల మధ్య ఊరేగింపు ముందుకు కదిలింది. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ప్రారంభించారు. ప్రత్యేక పూజల అనంతరం జీలకర్ర, బెల్లం ఉంచారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఆశేష భక్తులు తిలకిస్తుండగా పురోహితుల మంత్రోచ్చరణలు, సన్నాయి వాయిద్యాల మధ్య అమ్మవారి మంగళసూత్రధారణ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం తలంబ్రాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి దంపతులను మళ్లీ పల్లకీలో గర్భగుడి వద్దకు తీసుకెళ్లి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రకరకాల పూలు, వివిధ ఆభరణాల అలంకరణలో స్వామి దంపతులు ధగధగ మెరిసిపోతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. ఈ దృశ్యాన్ని చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి తదితరులు పాల్గొన్నారు.

కల్లు ఇవ్వలేదని వివాహిత ఆత్మహత్య

పాన్‌గల్: కల్లు ఇవ్వలేదని వివాహిత ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. మండలంలోని రేమద్దులకు చెందిన భవానీ(26)కి మేనమామ అయిన మండ్ల రాములుతో 9ఏళ్ల కిందట వివాహమైంది. భవానీకి తరచుగా కల్లు తాగే అలవాటు ఉంది. అదేక్రమంలో ఆదివారం కల్లు తీసుకురావాలని భర్తకు చెప్పగా సాయంకాలం తీసుకొస్తానని చెప్పి భర్త కూలీ పనికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడం.. కల్లు తీసుకొస్తానని చెప్పి తీసుకురాకపోవడంతో మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కూలీ పనికి వెళ్లిన భర్త మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చి చూడగా.. ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఉన్న భార్య శవాన్ని కిందకు దించాడు. భవానీకి రోజూ కల్లుతాగే అలవాటు ఉండటం, కల్లు తాగకపోతే పిచ్చిపిచ్చిగా ప్రవర్తించేదని, భర్త కల్లు తెచ్చి ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది క్షణికావేశంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని చనిపోయిందని ఎవరిపై ఎలాంటి అనుమానం లేదని మృతురాలి తల్లి రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

'వంద కవులు-ఐదొందల మొగ్గలు' పుస్తకావిష్కరణ


వంద కవులు-ఐదొందల మొగ్గలు పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రపంచా కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని వందమంది కవులు రాసిన ఐదొందలు మొగ్గలు పుస్తకావిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని బిర్లా ప్లాంటోరియల్‌లోని ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త, ఆంధ్రప్రదేశ్ జానపద అకాడమీ, అధికారభాషా సంఘం మాజీ చైర్మన్ పొట్లూరి హరికృష్ణ సంపాదకత్వంలో రూపొందిన 'వంద కవులు–ఐదొందల మొగ్గలు' పుస్తకాన్ని పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి, పాలమూరు సాహితీ అధ్యక్షుడు, మొగ్గలు ప్రక్రియ రూపకర్త డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కవులకు కాళోజీ పురస్కారాలు

తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాళోజీ జయంతి సందర్భంగా పాలమూరు జిల్లా కవులకు ఆర్ట్ ఫౌండేషన్ కాళోజీ పురస్కారాలను అందజేశారు. జిల్లాకు చెందిన కవులు కోట్ల వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్‌కు ఆదివారం హైదరాబాద్‌లోని బిర్లా ప్లాంటోరియం ఆడిటోరియంలో మెమెంటో, శాలువాతో సత్కరించారు.

జూరాలకు స్వల్పంగా పెరిగిన వరద


శ్రీశైలం ఆనకట్ట నుంచి దిగువకు పారుతున్న వరద

ధరూరు/ఆత్మకూర్/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ఆదివారం స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం 1,10,500 క్యూసెక్కులు ఉండగా... ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో 1,20,500 క్యూసెక్కులకు పెరిగినట్లు వివరించారు. దీంతో ప్రాజెక్టు 12 క్రస్ట్ గేట్లు ఎత్తి 85,104 క్యూసెక్కులు దిగువకు వదిలినట్లు చెప్పారు. అలాగే విద్యుదుద్పత్తి నిమిత్తం 39,351 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 71, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 700, సమాంతర కాల్వకు 400, భీమా లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు వినియోగించినట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.009 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

613 మి.యూ. విద్యుదుత్పత్తి..

జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగంగా కొనసాగుతోంది. ఆదివారం ఎగువ 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 292.964 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 320.595 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు.

శ్రీశైలంలో మూడు గేట్లు ఎత్తి..

ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహం పెరగడంతో ఆదివారం శ్రీశైలం ఆనకట్ట మూడు గేట్లను పైకెత్తి దిగువనున్న నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేశారు. జూరాల ఆనకట్ట స్పిల్‌వే నుంచి 85,104 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 39,351 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 48,906 క్యూసెక్కులు జలాశయానికి చేరుతుండగా.. శ్రీశైలం ఆనకట్ట మూడు గేట్లు ఒక్కొక్కటి పది అడుగుల మేర ఎత్తి స్పిల్‌వే ద్వారా 82,986 క్యూసెక్కులు దిగవకు వదిలారు.